
Postal Licence No: VJ/220/2023-25



నేటి పత్రిక
# ప్రజా వార్త
NETI PATRIKA PRAJA VARTHA
తెలుగు వారపత్రిక

TELUGU ONLINE
DIGITAL NEWS
PORTAL &
ONLINE CHANEL
Prajavatha-Online Telugu News
http://www.prajavartha.com
వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ: 24 - 31 జనవరి 2024 | ఎడిటర్ : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి : 2 | సంచిక : 82 | పేజీలు : 4, వెల: రూ.5

# ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు... అర్జునుడు

**: సీఎం వైఎస్ జగన్**

**విశాఖపట్నం, నేటి పత్రిక ప్రజావార్త :**
వైఎస్ఆర్సీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ జిల్లా భీమిలి నుంచి ఎన్నికల సమర శంఖారావం పూరించారు. 'సిద్ధం' పేరుతో భీమిలిలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి వైసీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అభిమానులు, కార్యకర్తలతో సభాస్థలి నిండిపోయింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి జగన్ ఉద్వేగంగా ప్రసంగించారు. ఎన్నికల సమరానికి క్యాడర్‌ను సిద్ధం చేస్తూ.. సమరశంఖం పూరించారు వైఎస్ జగన్. కురుక్షేత్ర యుద్ధంలో అర్జునుడిలా పోరాడుతున్న తనకు.. అండగా నిలవాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. భీమిలి వేదికగా జరిగిన సిద్ధం సభకు తరలివచ్చిన ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నేతలు, కార్యకర్తలకు..175 అసెంబ్లీ, 25 పార్లమెంటు స్థానాల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని కర్తవ్యబోధ చేశారు.. వైసీపీ అధినేత. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమం అందిస్తున్నామని.. ప్రభుత్వం చేసిన మంచి పనులే మనల్ని గెలిపిస్తాయని స్పష్టం చేశారు.

ఈ యుద్ధంలో 175కి 175 సీట్లు గెలుపే మన లక్ష్యమన్నారు. దేవుడి దయ..ప్రజల మద్దతు ఉన్నంత కాలం ఎవరికీ బెదరనని చెప్పుకొచ్చారు. ఓవైపు 56 నెలల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూనే.. టీడీపీ, జనసేన కూటమిపై విమర్శల బాణాలు సంధించారు..సీఎం జగన్. చంద్రబాబుకు ఒంటరిగా పోటీచేసే ధైర్యం లేక..దత్తపుత్రుడితో పాటు ఇతరుల కోసం వెంపర్లాడుతున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు 175 స్థానాల్లో పోటీకి అభ్యర్థులు కూడా లేరని జగన్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వం నుండి లబ్ధిపొందిన వర్గాలే తనకు స్టార్ క్యాంపెయినరని చెప్పారు జగన్. కుప్పం నుంచి ఇచ్ఛాపురం దాకా ఏ గ్రామానికి వెళ్లినా వైసీపీ ప్రభుత్వం, జగన్ మార్క్ పాలన కనిపిస్తుందని చెప్పారు. లంచాలు, వివక్షతకు తావు లేకుండా పథకాలు, పాలన అందిస్తున్నామని జగన్ చెప్పుకొచ్చారు. వైసీపీది వయసుతో పాటుగా మనసు, భవిష్యత్ ఉన్న పార్టీగా జగన్ పేర్కొన్నారు. వచ్చే రెండు నెలలు రాష్ట్రంలో జరిగేది యుద్ధమేనన్నారు.. సీఎం జగన్. నేతలు, కార్యకర్తలు సైన్యంగా పని చేయాలని చెప్పారు. ఓవైపు ప్రభుత్వ పథకాలను వివరిస్తూనే.. సోషల్‌మీడియాలో ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని నిర్దేశించారు. మొత్తానికి మొదటి సిద్ధం సభతోనే క్యాడర్‌లో జోష్ పెంచారు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. మన టార్గెట్ 175కు 175 అసెంబ్లీ, 25కు 25 ఎంపీ స్థానాలు గెలవడమే అని స్పష్టం చేశారు.







# వచ్చే కురుక్షేత్ర సంగ్రామానికి టీడీపీ, జనసేన సిద్ధం

**- నారా చంద్రబాబునాయుడు**



**పీలేరు, నేటి పత్రిక ప్రజావార్త :**
వైసీపీ పని అయిపోయిందని, ఆ పార్టీకి ఎన్నికల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకటం లేదని రేపు జరగబోయే కురుక్షేత్ర ధర్మ యుద్ధంలో టీడీపీ, జనసేనదే గెలుపు అని టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. "రా.. కదలిరా" పేరుతో నిర్వహిస్తున్న బహిరంగ సభల్లో సీఎం జగన్‌పై టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా విరుచుకుపడుతున్నారు. వైసీపీ పాలనలో ప్రజలు అల్లాడిపోతున్నారంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా పీలేరులో "రా..కదలి రా" బహిరంగ సభలోనూ జగన్‌పై చంద్రబాబు మరోసారి నిప్పులు చెరిగారు. విశాఖలో వైసీపీ నిర్వహిస్తున్న "సిద్ధం" సభను ఇక్కడ ప్రస్తావిస్తూ.. అవినీతి డబ్బుతో ఎన్నికల సభల కోసం పెద్ద పెద్ద ఫ్లెక్సీలు సిద్ధమని పెడుతున్నారని మండిపడ్డారు. జగన్‌ను ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

జగన్‌కు అభ్యర్థులు కూడా దొరకడం లేదన్నారు. జగన్‌ను ఇంటికి పంపడానికి యువత, రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్ అధికార అహంకారాన్ని దించడానికి ప్రభుత్వ ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల అనంతరం వైఎస్సార్ పార్టీ జెండా పీకేయడం తప్పదని స్పష్టం చేశారు. "యుద్ధం ప్రారంభమైంది. యుద్ధానికి మేము సిద్ధం" అని తేల్చిచెప్పారు. కురుక్షేత్ర ధర్మ యుద్ధానికి జనసేన, టీడీపీ సిద్ధంగా ఉన్నాయన్నారు. 2019లో ముద్దులు పెట్టి బుగ్గలు నొక్కి మోసం చేశారన్నారు. ఒక్క అభివృద్ధి లేదు, ప్రాజెక్టు లేదు, పరిశ్రమ లేదని మండిపడ్డారు.

"నేను రాయలసీమ బిడ్డను, నాలో ఉన్నది రాయలసీమ రక్తం. రాయలసీమను రతనాల సీమ చేయాలంటే ఏం చేయాలో అన్ని ఆలోచన చేశాను. హంద్రీనివాపై మేము రూ.4200 కోట్లు ఖర్చు పెట్టాం. జగన్ ఒక రూపాయి కూడా పెట్టలేదు. పీలేరు పుంగనూరులకు నీళ్లు రాలేదు. గాలేరు నగిరిపై రూ.1550 కోట్లు మేము ఖర్చు పెట్టాం" అని చంద్రబాబు వెల్లడించారు.

టీడీపీ అధికారంలోకి వచ్చాక పీలేరు, పుంగనూరు, మదనపల్లె, తంబళపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేస్తాం. హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తి చేసి చెరువులకు నీళ్లిస్తాం. ఏపీఐఐసీ ద్వారా సేకరించిన 2500 ఎకరాల్లో పరిశ్రమలు తెస్తాం. మదనపల్లె, తిరుపతి రోడ్డును పూర్తి చేస్తాం. టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

## 'గగన్‌యాన్'కు రెడీ

**-షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి**



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ ఏడాదిని గగన్‌యాన్ ప్రాజెక్టు సంవత్సరంగా పరిగణిస్తోందని, మరిన్ని ప్రయోగాలు చేపట్టనున్నామని సతీశ్‌ధవన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలిపారు. శుక్రవారం షార్‌లో 75వ గణతంత్ర దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025 నాటికి మానవ సహిత ప్రయోగాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 ప్రయోగాలతో 2023 ఇస్రో చరిత్రలో గుర్తుండిపోతుందన్నారు. ఈ ప్రయోగాలకు సంబంధించి ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్‌కు మ్యాన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు రావడం ఇస్రోకు గిఫ్ట్ అని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని పంపిన ఎల్‌వీఎం మార్క్-3 రాకెట్, ల్యాండర్, రోవర్‌ను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కొత్త ఏడాదికి కానుకగా పీఎస్ఎల్‌వీ సీ58 ప్రయోగం నిర్వహించామని తెలిపారు. ఫిబ్రవరి రెండోవారంలో ఇన్‌శాట్-3 డీఎస్ ప్రయోగం నిర్వహించనున్నామని, ఈ ఏడాది మరో పది ప్రయోగాలకు సిద్ధమవుతున్నామని చెప్పారు. విద్యార్థులంతా స్పేస్ సైన్స్‌పై అవగాహన పెంచుకుని ఉన్నత చదువులు చదువుకోవాలని ఆకాంక్షించారు. దేశంలో సామాన్యులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, సైన్యానికి విలువైన సమాచారాన్ని అందజేస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఇస్రో ఈ ఏడాది నుంచి వాణిజ్యపరంగానే కాకుండా ప్రైవేట్ స్పేస్ సంస్థలకు చెందిన ప్రయోగాలూ చేపడుతుందని రాజరాజన్ వెల్లడించారు.

## ఓటు వేసేందుకు సమయం కేటాయించండి



**చెన్నై, నేటి పత్రిక ప్రజావార్త :**
ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రజలు సమయం కేటాయించాలని మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమలహాసన్ పిలుపునిచ్చారు. గతంలో పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో 73 శాతం ఓట్లు నమోదయ్యాయన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇది మరింత తగ్గే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారన్నారు. విద్య, వైద్య, ఉపాధి, అభివృద్ధి రంగాల్లో మార్పులు రావాల్సిన అవసరం ఉందని, ఓటు ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుందని తెలిపారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తు దృష్ట్యా యంత్రంగా మారిన రోజువారీ జీవితంలో, ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రజలు సమయం కేటాయించాలని కమల్ విజ్ఞప్తి చేశారు.

# వైసీపీలో కొత్త హుషారు

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**
రాబోయే ఎన్నికల దృష్ట్యా ఉమ్మడి కృష్ణాజిల్లా వైసీపీలో కొత్త హుషారు కనపడుతోంది. నిన్నటి వరకూ అలకబూనిన మల్లాది విష్ణు కూడా పార్టీ నిర్ణయమే శిరోధార్యమని ప్రకటించడంతో బెజవాడలో మళ్లీ సత్తా చాటుతామని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఈనెల 30 జిల్లా పార్టీ కేడర్‌తో సీఎం జగన్ నిర్వహించే సమావేశానికి సైతం భారీగా తరలివెళ్లేలా కసరత్తు చేస్తున్నారు. ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ కంచుకోటగా ఉన్న ఉమ్మడి కృష్ణా జిల్లాలో గత ఎన్నికల్లో వైసీపీ దూసుకుపోయింది. ఈసారి కూడా గత ఎన్నికల ఫలితాలే పునరావృతం అయ్యేలా అధిష్టానం జిల్లాపై ముందు నుంచే ఫుల్ ఫోకస్ చేసింది. ఇందులో భాగంగా జిల్లాలో ముగ్గురు సిట్టింగ్‌లకు సీట్లు నిరాకరించింది వైసీపీ అధిష్టానం. పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి, తిరువూరు ఎమ్మెల్యే రక్షణ నిధి, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానంలో కొత్త ఇంచార్జిలను నియమించింది.

విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్థానంలో పక్క నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్న వెలంపల్లి శ్రీనివాస్‌కు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. పార్థసారథి, రక్షణ నిధిలు పార్టీ అధిష్టానం నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ.. మల్లాది విష్ణు మాత్రం మౌనంగా ఉండిపోయారు. వెలంపల్లికి సహకారం అందించేది లేనిది కూడా స్పష్టంగా చెప్పలేదు. విష్ణుతో పలుమార్లు వెలంపల్లి భేటీ అయినప్పటికీ ఆయన నుంచి ఎలాంటి హామీ రాలేదు. చివరకు సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధిపై వెలంపల్లి విజయవాడ కార్పొరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ మీటింగ్‌కు కూడా మల్లాది హాజరుకాలేదు. దీంతో అసలు మల్లాది విష్ణు ఏం చేయనున్నారనే అనుమానం మొదలైంది. విష్ణు లేకుండానే సెంట్రల్ నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన వెలంపల్లి డివిజన్ పర్యటనలు మొదలుపెట్టారు. అప్పటికే విష్ణు వెంట ఉండే కార్పొరేటర్లు చాలామంది వెలంపల్లికి మద్దతు ప్రకటించారు.

గురువారం సెంట్రల్ నియోజకవర్గంలో తన కొత్త కార్యాలయం ప్రారంభోత్సవానికి విష్ణును వెలంపల్లి ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి కొన్ని గంటల ముందు మల్లాది విష్ణు తన అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేశారు. వెలంపల్లికి సహకరించేది లేదని చాలామంది మల్లాది సన్నిహితులు చెబుతున్నా.. మల్లాది విష్ణు మాత్రం మెట్టు దిగారు. పార్టీ నిర్ణయమే తనకు శిరోధార్యం అని కార్యకర్తలకు తేల్చి చెప్పారు. దీంతో మల్లాది మెత్తబడిపోయారు. అన్ని ఊహాగానాలకు చెక్ పెడుతూ వెలంపల్లి కొత్త కార్యాలయ ప్రారంభోత్సవానికి మల్లాది విష్ణు హాజరయ్యారు. పార్టీ కొత్త ఆఫీస్ వద్దకు వచ్చిన మల్లాది విష్ణు, వెలంపల్లి ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సీన్‌తో సెంట్రల్ నియోజకవర్గ వైసీపీలో నెలకొన్న అన్ని గొడవలకు ఫుల్ స్టాప్ పడినట్లయ్యింది. ఇదే వేదికపై పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డితో పాటు ఎంపీ కేశినేని నాని, ఇతర ముఖ్య నేతలు కూడా ఉన్నారు. విష్ణుకు మరింత పెద్ద బాధ్యతలు అప్పగించనున్నట్లు సజ్జల చెప్పారు.



మరోవైపు ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు, కైకలూరు మినహా మిగిలిన నియోజకవర్గాల ఇంచార్జిలు, పరిశీలకులతో రీజినల్ కోఆర్డినేటర్లు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మర్రి రాజశేఖర్ సమావేశమయ్యారు. ఈనెల 27 నుంచి సీఎం జగన్ రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో కేడర్‌తో సమావేశాలు ఏర్పాటు చేసారు. పలు జిల్లాల పార్టీ శ్రేణులను కలిపి ఒకచోట సమావేశం అవుతారు. దీంట్లో భాగంగా ఈనెల 30న ఏలూరులో వైసీపీ ప్రాంతీయ సదస్సు జరగనుంది. ఈ సదస్సులో ఉమ్మడి పశ్చిమ గోదావరి,ఉమ్మడి కృష్ణా జిల్లాల కేడర్‌తో సీఎం సమావేశం కానున్నారు. ఆ జిల్లాల్లోని నియోజకవర్గాల్లో ఉన్న గృహసారథులు, గ్రామస్థాయి ముఖ్య నాయకులు, క్రియాశీలక కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి పదివేల మంది పార్టీ ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యేలా చూడాలని ఈ సమావేశంలో నేతలు దిశానిర్దేశం చేశారు. కేడర్ ను సీఎం జగన్ దగ్గర చేసుకోవడం ద్వారా వచ్చే ఎన్నికల్లో గెలుపుపై వారికి దిశానిర్దేశం చేస్తారని ఆ పార్టీ నేతలు చెప్పారు. సీఎం జగన్ ప్రాంతీయ సమావేశానికి ముందు జిల్లాలో మొత్తం పరిస్థితులు చక్కబడ్డాయని వారు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. గత ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 స్థానాల్లో మొత్తం 14 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. తిరిగి వచ్చే ఎన్నికల్లో కూడా ఇదే రిపీట్ చేస్తామని ధీమా వ్యక్తంచేస్తున్నారు ఆ పార్టీ నేతలు. ఏమవుతుందో రాబోయే ఎన్నికలలో ఓటర్లే నిర్ణయించాలి మరి అని రాజకీయ విశ్లేషకులు అనుకుంటున్నారు...!

## ఎన్నికల సమయంలో అయినా ప్రత్యేక హొదా కోసం పోరాడాలి

**- ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**



**నెల్లూరు, నేటి పత్రిక ప్రజావార్త :**
ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నెల్లూరులో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ వైసీపీని ఏపీ నుంచి తరిమికొడుదామని పిలుపునిచ్చారు. వైఎస్సార్ పెట్టిన ఫీజ్ రీ ఎంబర్స్‌మెంట్ ఏమైంది...? అని ప్రశ్నించారు. యువతకి ఇక్కడ ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశారని మండిపడ్డారు. రైతులకు వైఎస్సార్ రుణమాఫీ చేశారని.. నేడు అప్పు లేని రైతు ఏపీలో లేడని ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టులు మరమ్మతులకి గురైతే కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని వైఎస్ షర్మిల మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అయినా ప్రత్యేక హొదా కోసం పోరాడాలని.. ఇప్పుడు కూడా రాకుంటే మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సి ఉంటుందని తెలిపారు. తన పుట్టినిల్లు కాబట్టి రాజశేఖర్ రెడ్డి బిడ్డగా ఇక్కడ రాజకీయాలు చేస్తున్నానని వ్యాఖ్యానించారు. వైఎస్సార్ ఆశయాలని కాపాడే పార్టీ కాంగ్రెస్... కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. ఏపీ ప్రత్యేక హొదాపై రాహుల్ గాంధీ ప్రధాని అయ్యాక తొలి సంతకం పెడుతారని స్పష్టం చేశారు. ఏపీ అన్ని విధాలా అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ రావాలని వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

# సందడిగా రాజ్‌భవన్‌లో 'ఎట్ హోమ్'

**- ప్రముఖులకు తేనేటి విందు ఇచ్చిన గవర్నర్**

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్ కార్యక్రమం సందడిగా జరిగింది. గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ రాష్ట్రంలోని ప్రముఖులకు రాజ్‌భవన్‌లో తేనీటి విందు ఇచ్చారు. ఈ విందుకు సీఎం వైఎస్ జగన్, వైఎస్ భారతి దంపతులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, గుడియా ఠాకూర్ దంపతులతోపాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సాయంత్రం 5.30 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి దంపతులకు గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ సాదర స్వాగతం పలికారు. అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం మొదలైంది. గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్ భారతి దంపతులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ దంపతులు వివిధ అంశాలపై కొద్దిసేపు సంభాషించుకున్నారు. రాజ్‌భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ మీద ప్రదర్శించిన దేశ స్వాతంత్ర్య పోరాట చిత్రాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అతిథులు అందరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు జోగి రమేశ్, ఆర్ కే రోజా, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్వాతంత్ర్య సమర యోధులు, పద్మ అవార్డు గ్రహీతలు, వివిధ రంగాల ప్రముఖులు, అధికారులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు.



## మాలలకు సముచిత స్థానం కల్పించాలి : గోగులమూడి రాము



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయిపులో మాలల కు సముచిత స్థానం కల్పించాలని జై మాల మహానాడు అధ్యక్షులు గోగులమూడి రాము కోరారు. కొన్ని ప్రాంతాల్లో మాలలకు పూర్తి స్థాయి లో అన్యాయం జరుగుతుందని తమ దృష్టి కి వచ్చిందని తెలిపారు. అదే నిజమైతే ఆయా పార్టీలు రానున్న రోజులలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పార్టీ లు ఎన్ని ఉన్న ఏ ప్రాంతమైన మాలల కు న్యాయం చేయాలనీ గోగులమూడి రాము కోరారు.

## ఇచ్చిన హామీని నెరవేర్చి, న్యాయమైన కోర్కెలు తీర్చాలి

-డి.ఆర్.డి.ఎ-వై.కె.పి. ఉద్యోగుల జేఏసి




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
గ్రామీణ పేదరిక నిర్మూలనా (సెర్ప్) సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి, సంస్థలో పనిచేస్తున్న అన్ని కేడర్లను క్రమబద్ధీకరణ చేయాలని డి.ఆర్.డి.ఎ-వై.కె.పి. ఉద్యోగుల జేఏసి, ఎన్టీఆర్ జిల్లా కమిటీ కోరింది. గురువారం విజయవాడ ధర్నాచౌక్‌లో డిఆర్‌డిఎ-వైఎస్ఆర్ క్రాంతి పథం ఉద్యోగుల జేఏసి నిరవధిక సమ్మె జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ కమిటి తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాల కార్యక్రమాల్లో తమ ఉద్యోగులు ప్రధాన భూమిక పోషించామన్నారు. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. తెలంగాణా రాష్ట్రంలో ఇచ్చినట్లు డిఏతో కూడిన పే స్కేలు అమలు, కారుణ్య నియామకాలు, ఉద్యోగుల వయస్సు 62 సంవత్సరాలు పెంపు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు, సభ్యులు, కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడలో ఘనంగా జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలు



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయవాడలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో ముందుగా పాఠశాల డైరెక్టర్ కడియాల ప్రవీణ్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేసారు. అందరూ జాతీయ గీతాన్ని ఆలపించారు. సోషల్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ జాన్ గణతంత్ర దినోత్సవం యొక్క గొప్పతనాన్ని గురించి ఉపన్యాసించారు. భిన్నత్వంలో ఏకత్వం లాగా జాతీయ గీతాలను పిల్లలు ఆలపించి పాఠశాల ఆవరణం మొత్తం దేశభక్తితో నింపారు. ఉత్సాహభరితమైన నృత్య ప్రదర్శనలు మరియు అందరిని ఆకట్టుకునే జిమ్నాస్టిక్ చర్యలతో విద్యార్థుల ప్రతిభను మరియు ఉత్సాహాన్ని ప్రదర్శించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గణతంత్ర వేడుకల్లో గాంధీ నాగరాజన్



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గాంధీ నాగరాజన్ దేశ ప్రజలకు 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమనియోజకవర్గంలోని ఊర్మిళనగర్‌లో వున్న గాంధీదేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ కార్యాలయంలో శుక్రవారం భారత 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జాతీయపతాకాన్ని ట్రస్ట్ ఎపి అధ్యక్షురాలు బంగారు భారతి ఎగురవేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు గాంధీ నాగరాజన్ మాట్లాడుతూ జనవరి 26న భారతావని నిజమైన సర్వసత్తాక, గణతంత్ర దేశంగా అవతరించిందన్నారు. భారత స్వాతంత్ర్య సముపార్జనలో అమరుల త్యాగాలు మరువలేనివన్నారు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగా నేడు మనం గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించుకుంటున్నామని చెప్పారు. భారతదేశంలో అందరికీ సరైన విద్య, వైద్యం, న్యాయం దక్కాలని అన్నారు. మహిళలకు చట్టసభల్లో సమానవాటా దక్కాల్సిన అవసరం వుందన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల సంఘం జనరల్ సెక్రటరీని కలిసి అక్కడి మహాత్మాగాంధీ విగ్రహానికి నూలుమాలను వేసి గణతంత్ర దినోత్సవం గురించి వివరించి అమరుల త్యాగాలు మరువలేనివన్నారు. స్వాతంత్ర్య సాధనకు ప్రాణాలను పణంగాపెట్టి పోరాడి అసువులు బాసిన జాతీయ నాయకులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాపు మ్యూజియంలో లేజర్ షో మరియు సౌండ్ అండ్ లైట్ షో ప్రారంభం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
దేశంలోనే గొప్ప వారసత్వ నిలయంగా ఆంధ్రప్రదేశ్ విరాజిల్లుతోందని.. ఇందుకు విజయవాడలోని బాపు మ్యూజియమే నిదర్శనమే పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడలు మరియు పురావస్తు ప్రదర్శనశాలల శాఖామాత్యులు ఆర్.కె. రోజా అన్నారు. రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ ఆధ్వర్యంలో శ్రీ పింగళి వెంకయ్య గ్యాలరీ (విక్టోరియా హాల్), బాపు మ్యూజియం నందు లేజర్ షో మరియు సౌండ్ & లైట్ షో ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్.కె.రోజా మాట్లాడుతూ.. చరిత్ర గొప్పతనాన్ని తెలుసుకోవాలంటే కచ్చితంగా బాపు మ్యూజియానికి రావాలని అన్నారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తోన్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కనిపిస్తోందన్నారు. అత్యంత ప్రసిద్ధి చెందిన, పురాతనమైన బాపు మ్యూజియాన్ని జగనన్న ప్రభుత్వంలోనే అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి సంతరించుకుందన్నారు. బాపు మ్యూజియంలో లేజర్ షో మరియు సౌండ్ & లైట్ షోను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

ఈ లేజర్ షో మరియు సౌండ్ & లైట్ షో ద్వారా చారిత్రక వారసత్వ సంపద, విజ్ఞాన కేంద్రంగా బాసిల్లుతున్న బాపు మ్యూజియం విశిష్టతను నగరవాసులు, పర్యాటకులు తెలుసుకోవాలన్నారు. ఘన చరిత్ర కలిగిన బాపు మ్యూజియంలో భావితరాలకు చాలా అవసరమైన గొప్ప చరిత్రను టెక్నాలజీ ఉపయోగించి నిక్షిప్తం చేయడం జరిగిందన్నారు. విజయవాడలో అంబేద్కర్ భారీ విగ్రహం, బాపు మ్యూజియం, భవాని ఐలాండ్ వంటి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేశామని మంత్రి చెప్పారు.

ఈ సందర్భంగా ఎంపీ నాని మాట్లాడుతూ.. చారిత్రక వారసత్వ సంపదకు విజయవాడ కేంద్రమన్నారు. బాపు మ్యూజియంలో లేజర్ షో మరియు సౌండ్ & లైట్ షో ను ప్రారంభించడం ఆనందంగా ఉందని.. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో పర్యాటకం మరింత అభివృద్ధి చెందుతోందని తెలిపారు. అనంతరం బాపు మ్యూజియంలో ప్రాక్, చారిత్రక గ్యాలరీ, బుద్ధ జైన్ గ్యాలరీ, హిందూ శిల్పకళా గ్యాలరీ, ఆయుధాలు కవచాలు గ్యాలరీని రోజా పరిశీలించారు. అనంతరం మహాత్మాగాంధీ, పింగళి వెంకయ్య విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన లేజర్ షో మరియు సౌండ్ & లైట్ షోను మంత్రి వీక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్, విజయవాడ సెంట్రల్ శాసనసభ్యులు మల్లాది విష్ణు, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని నాని, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు దేవులపల్లి అమర్, రాష్ట్ర ప్రదర్శనశాల శాఖ కమిషనర్ వాణిమోహన్, డిప్యూటీ డైరెక్టర్లు రామసుబ్బారెడ్డి, పి.సురేష్, అసిస్టెంట్ డైరెక్టర్లు ఎస్. వెంకట్రావు, కె.నరసింహనాయుడు, ఇతర పురావస్తు మరియు ప్రదర్శనశాలల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయస్థాయిలో థర్డ్ ఫ్రంట్ నిర్మాణం




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
దేశ ప్రజలకు 75 వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఐపీసీ రాష్ట్ర అధ్యక్షులు యుఎస్ఎస్ఎ థర్డ్ ఫ్రంట్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు దేవరపల్లి మహేష్ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. యూనియన్ స్టేట్స్ ఆఫ్ సోషలిస్ట్ అలియాన్స్ థర్డ్ ఫ్రంట్ నిర్మాణాన్ని జాతీయ స్థాయిలో చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామని అందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లేలా కార్యాచరణను కూడా సిద్ధం చేస్తున్నామని ఆయన తెలియజేశారు. థర్డ్ ఫ్రంట్ ప్రణాళిక గణతంత్ర దినోత్సవం రోజున విడుదల చేయాలని తొలిత నిర్ణయించినా దానిని ఆర్థిక నిపుణులు రాజకీయ మేధావులు సామాజిక విశ్లేషకులతో ప్రజల సమక్షంలో పరిశీలించి విడుదల చేయడానికి మరి కొంత సమయం పడుతుందని ఆయన తెలియజేశారు. సామాజిక అభివృద్ధికిలో ఎంతో కీలకమైన పాత్ర పోషించే మీడియా కూడా సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రామ మందిరం విషయాన్ని ప్రస్తావిస్తూ, కొన్ని రాజకీయ పార్టీలు వారి అభిప్రాయాలు తెలియజేయడానికి వ్యంగ అస్త్రాలను వాడుతున్నారు. అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ట చేస్తున్నామని నిర్వాహకులు ముందుగానే తెలియజేశారు. ఈ విషయంలో వారు స్పష్టంగానే చెప్పారు. అర్థం చేసుకునే విషయం లోపించి కొందరు విమర్శలు చేస్తున్నారు. హిందూ మతం మతం కాదు అది ఒక జీవన విధానం అని ప్రతి ఒక్కరికి తెలుసు. ఐదు శతాబ్దాలు రామ మందిరం లేని కారణంగా ఐదు సంవత్సరాలు బాల రాముని ప్రాణ ప్రతిష్ట చేసి ఉండవచ్చు. కాల క్రమంలో శ్రీరాముని పట్టాభిషేకమూ అవుతుంది కళ్యాణము జరుగుతుంది. తదనంతర కార్యక్రమాలు కూడా జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏది యేమైనా రాజ్యాంగం ఆరాధనల్లో స్వాతంత్రాన్ని ఇచ్చింది కాబట్టి ప్రతి ఒక్కరూ దానిని గౌరవించాలని ఆయన తెలియజేశారు.

## విజయవాడ మీదుగా పలు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లను పొడిగిస్తున్నట్లు విజయవాడ డివిజన్ పీఆర్ఓ నుస్రత్ మండ్రుప్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 5 నుంచి మార్చి 25 వరకు పూర్ణా-తిరుపతి (07609), ఫిబ్రవరి 6 నుంచి మార్చి 26 వరకు తిరుపతి-పూర్ణా (07610), ఫిబ్రవరి 3 నుంచి మార్చి 30 వరకు హైదరాబాద్-నర్సాపూర్ (07631), ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు నర్సాపూర్-హైదరాబాద్ (07632), ఫిబ్రవరి 4 నుంచి మార్చి 31 వరకు తిరుపతి-సికింద్రాబాద్ (07481), ఫిబ్రవరి 5 నుంచి ఏప్రిల్ 1 వరకు సికింద్రాబాద్-తిరుపతి (07482), ఫిబ్రవరి 2 నుంచి మార్చి 29 వరకు కాకినాడ టౌన్-లింగంపల్లి (07445), ఫిబ్రవరి 3 నుంచి మార్చి 30 వరకు లింగంపల్లి-కాకినాడ టౌన్ (07446) రైళ్లను పొడిగించి నడపనున్నట్లు తెలిపారు.

## ఘనంగా పశ్చిమ వైసీపీ ఆత్మీయ సమ్మేళనం




**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
నగరంలోని పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం జరిగింది. గురువారం విద్యాధరపురం, కబేళారోడ్డులోని ఓ ప్రైవేట్ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్లు మర్రి రాజశేఖరరెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని), పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు తమ ప్రసంగంతో పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచారు. ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మేలు జరిగితేనే తమకు ఓట్లు వెయ్యమని ధైర్యంగా అడగగలిగిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు.

గత ప్రభుత్వ పాలన మాదిరిగా కాకుండా కులం, మతం, పార్టీ వర్గాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రజలకు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎం చెప్పారో అదే చేశారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అంబేద్కర్‌కు లభించిన గౌరవం ఏపీలో మాత్రమే దక్కిందని, అది సీఎం వైఎస్ జగన్ వలనే సాధ్యమయ్యిందని పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా నడిపించామని, ముఖ్యంగా సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులతో పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురంలో నిర్మించనున్న స్టేడియంకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్టేడియంగా నామకరణం చేస్తున్నామని తెలిపారు. రానున్న 5 ఏళ్లలో మరిన్ని సేవలు అందించేందుకు ఆయా నియోజకవర్గాల్లోని వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 30న ఏలూరు జిల్లాలో జరుగనున్న సమావేశంలో సీఎం వైఎస్ జగన్ పాల్గొంటారని, ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. అక్కడ జగనన్న పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేస్తారని చెప్పారు. రాష్ట్రంలోని పేదలు, పెత్తందార్లకు మధ్య జరగబోయే ఎన్నికల యుద్ధానికి అంతా సిద్ధమా... సిద్ధమా... ఇంటూ నాయకులు పార్టీ శ్రేణులను ఉత్తేజపరచగా అంతకంటే రెట్టించిన ఉత్సాహంతో 'సిద్ధమే' అని పార్టీ శ్రేణులు ఎలుగెత్తి చాటారు. నిర్వాహకుడు అసిఫ్ మాట్లాడుతూ మనం చేసేది మంచి పనయితే, ఇది పట్టుదలతో చేస్తే విజయం తథ్యమని సీఎం వైఎస్ జగనన్న ద్వారా తెలుసుకున్నానని పేర్కొన్నారు. నియోజకవర్గ బాధ్యతలను అప్పగించే స్థాయి వరకు ప్రోత్సహించిన సీఎం జగనన్నకు రుణపడి వుంటానని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి ఏదో ఒక రోజు తగిన గుర్తింపు లభిస్తుందని, అందుకు తానే నిదర్శనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పామర్రు. ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్, విజయవాడ తూర్పు ఇన్‌ఛార్జి దేవినేని అవినాష్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పలువురు కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాష్ట్ర రాజకీయాలలో మాలలకు సముచిత స్థానం కల్పించాలి : మాలల రాష్ట్ర జేఏసీ



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు మాలలను ఓటు బ్యాంకుగానే చూస్తు న్నారు అని మాల జేఏసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన పాత్రికేయ సమావేశంలో మాలల జేఏసీ నాయకులు మాట్లాడుతూ 2024 అసెంబ్లీ ఎన్నికలలో రాష్ట్ర వ్యాప్తంగా మాలలకు ఆయా రిజర్వుడు నియోజకవర్గాలలో సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మూడు నియోజకవర్గాలలో టిడిపి మాదిగలకు సీట్లు కేటాయించడం జరిగింది. మనలకు ఒక నియోజక వర్గంలో కూడా కేటాయించకపోవడం దారుణం అన్నారు. ఇదే ఇదే బాటలో వైయస్సార్‌సిపి పార్టీ కూడా నడుస్తుందని మాల వ్యతిరేక పార్టీలైన అన్ని పార్టీలకు 2024 ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్తామని అన్నారు.

ఇప్పటికైనా ఆయా రాజకీయ పార్టీలు పునరాలోచించి మాలలకు తగిన టికెట్లు కేటాయించాలని మాల జాతిని ఏ పార్టీ గుర్తిస్తుందో ఆ పార్టీకే రానున్న ఎన్నికలలో పనిచేయనున్నట్లు మాల జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్య క్రమంలో భాగంగా మరో 15 రోజుల్లో రాష్ట్ర స్థాయి మాలల ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేయనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు.

భారీ బహిరంగ సభ ద్వారా మా నిర్ణయం ఆరోజే తెలియజేస్తామని మాలల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. అలాగే రానున్న ఫిబ్రవరి నెలనుండి రాష్ట్రం లోనే 175 నియోజకవర్గాలలో మాలలను కలుస్తూ 2024 ఎన్నికలకు సంయుక్తం చేస్తామని జేఏసీ నాయకులు తెలిపారు రాజకీయ పార్టీలు ఎప్పటికైనా కళ్ళు తెరిచే మనలకు సముచిత స్థానం కల్పించని పక్షంలో 175 నియోజక వర్గాలలో స్వతంత్ర అభ్యర్థులను నిలబెట్టి మా ఓటు మనకోసం అనే నినాదంతో వేలుటకు కూడా వెనకడుగు వేయబమని ఈ సందర్భంగా తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ మాల నాయకులు. జై మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోగులమూడి రాము, ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు వీర బత్తిన అమల దాసు, మాల మహానాడు అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు సేవ నాగ జగన్ బాబురావు, జై మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గోవాడ సునీల్, జై మాల మహానాడు కార్యవర్గ సభ్యులు బాపట్ల కిరణ్‌కుమార్, రాష్ట్ర మాల మహానాడు ఉపాధ్యక్షురాలు చుక్క రాణి, జై భీమ్ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు దియ్యాల జ్యోతి మేరీ, మాల మహానాడు రాష్ట్ర విద్యార్థి విభాగ అధ్యక్షులు జక్కుల విజయ్‌కుమార్, మాల మహానాడు యూత్ విభాగ అధ్యక్షులు జల్ది శివకుమార్ పాల్గొన్నారు.

# ఎన్నికల్లో పటిష్ట నిఘా

– రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్‌రెడ్డి



**వెలగపూడి, నేటి పత్రిక ప్రజావార్త :**
రానున్న సాధారణ ఎన్నికల పటిష్ట నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం (కలక్టరేట్లు), అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు 982 పోస్టులను మంజూరు చేయడం జరిగిందని, ఆ పోస్టులను త్వరగా భర్తీ చేసుకోవాలని జిల్లా కలక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనాతో కలిసి ఆయన ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ఎన్నికలతో సంబంధం ఉండి మూడేళ్ళు సర్వీసు పూర్తి చేసుకున్న వివిధ శాఖల అధికారుల బదిలీ ప్రక్రియ దాదాపు పూర్తయిందని పేర్కొన్నారు. ఇప్పటికే పిఆర్ అండ్ ఆర్డీ, ఎక్సైజ్, స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ బ్యూరోల్లో బదిలీల ప్రక్రియ పూర్తి అయిందని అన్నారు. పోలీస్, రెవెన్యూ శాఖల్లో కొంత మేరకు బదిలీలు జరగగా మిగాతా బదిలీలు ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో బదిలీలు కూడా రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని సిఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. రానున్న ఎన్నికల్లో పటిష్ట నిఘాకై రాష్ట్రవ్యాప్తంగా 105 అంతర్ రాష్ట్ర చెక్కు పోస్టులను ఏర్పాటు చేయగా వాటిలో 20 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు కాగా పోలీసు శాఖ ద్వారా 62, స్పెషల్ ఎన్ఫోర్సుమెంట్ బ్యూరో ద్వారా 9, అటవీశాఖ ద్వారా 14 చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందని సిఎస్.జవహర్ రెడ్డి పేర్కొన్నారు. గత నెల రోజుల్లో అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు ద్వారా 2కోట్ల 35 లక్షల రూ.ల నగదు, 51వేల 143 లీటర్ల మద్యం,1323 కిలోల వివిధ మాదక ద్రవ్యాలను,ఇతర విలువైన లోహాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని చెప్పారు. ఈచెక్ పోస్టులన్నీ రానున్న రోజుల్లో మరింత సమర్ధవంతంగా పనిచేసి అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలకు సంబంధించి ముఖ్యంగా తాగునీరు, పర్నిచర్, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ర్యాంపులు ఏర్పాటు వంటి సౌకర్యాలను త్వరిత గతిన ఏర్పాటు చేసేందుకు జిల్లా కలక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిఎస్.జవహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనా మాట్లాడుతూ రానున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ లాజిస్టిక్ ఏర్పాట్లకు ఇప్పటి నుండే తగిన చర్యలు తీసుకోవాలని కలక్టర్లను ఆదేశించారు.ఇంకా ఎన్నికల సన్నద్ధకు సంబంధించి తీసుకోవాల్సిన ఇతర అంశాలపై కలక్టర్లకు వివరించారు. ఈ సమావేశంలో అదనపు సిఇఓ కోటేశ్వరరావు, పిఆర్ అండ్ ఆర్డి కమీషనర్ సూర్యకుమారి, వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ జె.నివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారం లేకుండా కేటీఆర్ ఉండలేకపోతున్నారు

: మంత్రి సీతక్క



**సిరిసిల్ల, నేటి పత్రిక ప్రజావార్త :**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తెలంగాణ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. కేటీఆర్‌కు మైండ్ బ్లాకైందని విమర్శలు గుప్పించారు. తమ అహంకారమే బీఆర్ఎస్ ఓటమికి కారణమైందని దుయ్యబట్టారు. అధికారం లేకుండా కేటీఆర్ ఉండలేకపోతున్నారని, అందుకే విధ్వంస రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. సిరిసిల్లలోని వేములవాడ రాజరాజేశ్వర ఆలయాన్ని గురువారం మంత్రి సీతక్క దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల గడీల పాలన చేసిందని విమర్శించారు. ఇప్పుడు కూడా కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచినా ఇంకా ప్రమాణ స్వీకారం చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్‌పై విమర్శలు చేసేందుకు కేటీఆర్‌కు బుద్దుందా అని ప్రశ్నించిన సీతక్క ఆయన కుళ్లు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. 'ప్రజలు మావైపే ఉన్నారు. మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేస్తే జీర్ణించు కోలేకపోతున్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తే ప్రజలు గమనిస్తారు. సర్పంచుల వేల బిల్లులు పెండింగ్ పెట్టింది ఎవరు..? గత ప్రభుత్వం కాదా..? మేము సక్రమంగా పని చేస్తేనే మళ్ళీ అధికారం ఇస్తారు. చేయకపోతే అవకాశం ఇవ్వరు. కేటీఆర్ బుద్ధిగా ప్రతిపక్ష హొదాలో పని చేయ్. ప్రజలు గుర్తిస్తారు. లేదంటే మిమ్మల్ని ఎప్పటికీ ప్రజలు తిరస్కరిస్తూనే ఉంటారు. రాజన్న మా ఇలా వేల్పు. కుటుంబ సమేతంగా వచ్చి దర్శనం చేసుకున్నాం. ఆదివాసీ కుటుంబాలకు సమ్మక్క కంటే ముందు రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాజన్న ఆలయం అభివృద్ధిలో వివక్షకు గురైంది. మా ప్రభుత్వంలో తప్పకుండా అభివృద్ధి చేస్తాం.' అని సీతక్క పేర్కొన్నారు.

# తెలంగాణలో మరో పథకంపై సీఎం కీలక ప్రకటన



**హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :**
తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే మహా లక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించింది. అలాగే.. ఆరోగ్యశ్రీ పరిమితిని పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే మిగతా పథకాలను సైతం వీలైనంత త్వరగా అమలు చేయాలని చూస్తోంది. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలోపు మరో రెండు పథకాలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తోందని ఇప్పటికే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెలకు రూ. 2500 ఆర్థిక సహాయంతో పాటు సబ్సిడీ కింది రూ.500కే గ్యాస్ సిలిండర్‌ను అందించే పథకాలను అమలు చేయాలని కాంగ్రెస్ ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. త్వరలోనే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రానుందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే తాజాగా మరో పథకానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి రేవంత్ రెడ్డి శనివారం కీలక ప్రకటన చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు నగదుతో పాటు తులం బంగారం ఇవ్వనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఈ పథకానికి సంబంధించి ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించిన సీఎం పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. తులం బంగారం ఇవ్వడంతో పాటు.. రాష్ట్రంలోని ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే.. సంక్షేమ హాస్టళ్లకు గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలు గుర్తించి, అంచనాలు తయారు చేయాలన్నారు. ఈ సమీక్షలో పొన్నం ప్రభాకర్, సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు.

# జర్మనీలో నర్స్ అసిస్టెంట్‌గా అవకాశం

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎపిఎస్ఎస్‌ఎసి) ఆధ్వర్యంలో బిఎస్సీ నర్సింగ్ చదువుకున్నటువంటి వారికి జర్మనీలో నర్స్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పిస్తున్నట్లు యన్.టి.ర్ జిల్లా డిస్ట్రిక్ట్ కలెక్టర్ మరియు మేజిస్ట్రేట్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఇందుకొరకు అభ్యర్థులు 20-35 వయస్సు కలిగి కనీసం సాధారణ ఆసుపత్రులలో అనుభవం కలిగి జర్మన్ భాష నేర్చుకొనుటకు ఆసక్తి కలిగి ఉండాలి అని పేర్కొన్నారు.

అర్హత ప్రమాణం: అభ్యర్థి జర్మనీలో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలి.అభ్యర్థి తప్పనిసరిగా నర్సింగ్ గ్రాడ్యుయేట్ (బిఎస్సీ నర్సింగ్) అయి ఉండాలి. కనీసం పని అనుభవం ఉండాలి. అభ్యర్థి వయస్సు 20 - 35 సంవత్సరాల మధ్య ఉండాలి.

విజయవాడలోని ఎ.పి.యస్.యస్.డీ.సి-స్కిల్ కాలేజీ, దర్గా ప్లాట్స్, ఒప్పొసితె గౌతమ్ కార్గో, నియర్ వెంకటేశ్వర ఫౌండ్రి, భవానీపురం, విజయవాడ లో నిర్వహించబడే బి1 స్థాయి వరకు జర్మన్ భాషా శిక్షణ కోసం నిర్బంధ ఉచిత ఆన్‌లైన్ తరగతులకు హాజరు కావాలి. బి1 స్థాయి ఉత్తీర్ణత సాధించిన తర్వాత, జర్మనీలో పని చేయడానికి ఆఫర్ లెటర్ ఇవ్వబడుతుంది.

అవసరమైన పత్రాలు : రెజ్యూమ్ & ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్లు, చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, అనుభవ ధృవీకరణ పత్రం తప్పనిసరి.

జర్మనీలో సౌకర్యాలు : విమాన ఛార్జీలు ఉచితం. ఆహారం & వసతి ఉచితం మరియు జీతం నెలకు రూ.1,70,000/-. తర్వాత 6 నెలల పాటు జర్మనీలో బి2 సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇస్తారు. బి2 పరీక్షలో ఉత్తీర్ణత సాధించినప్పుడు జీతం నెలకు దాదాపుగా నెలకు రూ.3,10,000/- ఉంటుంది.

శిక్షణ తరగతుల సమయం షెడ్యూల్ : తరగతులు ఎ.పి.యస్.యస్.డీ.సి-స్కిల్ కాలేజీ, దర్గా ప్లాట్స్, ఒప్పొసితె గౌతమ్ కార్గో, నియర్ వెంకటేశ్వర ఫౌండ్రి, భవానీపురం, విజయవాడ. 30 జనవరి 2024 న ప్రారంభమవుతాయి. విద్యార్థులు హాస్టల్‌లలో ఉండాలి మరియు ఉచితం.

రిజిస్ట్రేషన్ నమోదు లింక్ : www.apssdc.in/home/onlineProgram Registration

ఆసక్తిగల అభ్యర్థులు దయచేసి మీ సర్టిఫికేట్ రెజ్యూమ్ని helpline@apssdc.in మెయిల్ ఐడి లేదా కాల్ సెంటర్: 99888 53335 మరియు 9885047939, 9494639385 ఈ నంబర్లను సంప్రదించగలరు.

# బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ భేటీ



**హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :**
కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ భేటీ జరిగింది. ఎర్రవల్లిలోని ఆయన ఫాంహౌస్‌లో జరిగిన ఈ సమావేశంలో పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, పార్టీ పార్లమెంటరీ నేతలు కే.కేశవరావు, నామా నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. కాగా, కేసీఆర్‌కు ఇటీవల తుంటి మార్పిడి శస్త్ర చికిత్స జరిగిన విషయం తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లోని తన నివాసంలో కొన్ని రోజులు విశ్రాంతి తీసుకున్న ఆయన ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. సర్జరీ అనంతరం నేడు తొలిసారిగా పార్టీ నేతలతో సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో అధిక స్థానాల్లో విజయం సాధించేలా బీఆర్ఎస్ ఫోకస్ పెట్టింది. శాసనసభ ఎన్నికల్లో ఎదురైన ప్రతికూల ఫలితాలను అన్ని కోణాల్లో పోస్ట్‌మార్టం చేసిన బీఆర్ఎస్.. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల ప్రణాళికపై దృష్టి సారించింది. లోక్‌సభ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న నేపథ్యంలో మెజారిటీ సీట్లను కైవసం చేసుకోవడం ద్వారా రెండు జాతీయ పార్టీలపై పైచేయి సాధించాలని కేసీఆర్ భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ వైపు ఎన్నికల సన్నద్ధతను వేగవంతం చేస్తూనే, మరోవైపు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపైనా దృష్టి సారించారు.

# ఈనెల 31వ తేదీన విభిన్న ప్రతిభావంతులు జాబ్‌మేళా..!

**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఉపాధి కల్పన శాఖ మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ఐటిఐ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు పలు రకాల ఉద్యోగాల నియామకానికి ఈ నెల 31వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి దేవరపల్లి విక్టర్ బాబు మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్ శ్రీనివాస్‌రావు సంయుక్తంగా తెలిపారు.ఈ జాబ్‌మేళా ఉదయం 10 గంటల నుండి ప్రారంభం అవుతుంది అని అన్నారు. 18 ఏళ్ల నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి 10వ తరగతి అపై చదివిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొనవచ్చు అని స్పష్టం చేశారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఏడాదికి 1.2లక్షల నుంచి 3 లక్షల వరకు వేతనం లభిస్తుంది అని అన్నారు. ఈ జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హత ధృవ పత్రాలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు https://www.ncs.gov.in లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోగలరు అని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8142416211 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# విజయవాడ వేదికగా "టెక్నికల్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్"

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :
భారత ప్రభుత్వ "నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ మిషన్"లో భాగంగా చేనేత, జౌళి శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే "టెక్నికల్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్"కు ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. జనవరి 29వ తేదీన విజయవాడలో ఈ సదస్సు జరగనుండగా, ఇండియన్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ అసోసియేషన్‌కు ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళి శాఖ నిరంతర సహకారం అందిస్తూ కార్యక్రమ నిర్వహణలో ప్రత్యేక చొరవ చూపుతోంది. నిశిత పరిశీలనతో కూడిన ప్యానెల్ చర్చలు, ప్రత్యేక వస్త్ర ప్రదర్శనతో కూడిన ఈ ఒకరోజు సదస్సు సాంకేతిక వస్త్రాలలో స్థిరమైన ఆవిష్కరణలకు కేంద్ర బిందువుగా మారనుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి (చేనేత, జౌళి) కె.సునీత తెలిపారు.

ప్యానల్ స్పీకర్లుగా దేశవ్యాప్తంగా ఉన్న పరిశ్రమ ప్రముఖులు వ్యవహరిస్తున్నారన్నారు. వృత్తాకార ఆర్థిక వ్యవస్థ వ్యూహాలు, జియోటెక్ టెక్స్‌టైల్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ వాతావరణాన్ని తట్టుకోగల మౌలిక సదుపాయాలను నిర్మించడం, అగ్రోటెక్ సొల్యూషన్‌లను పెంచడం, సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగంలో భవిష్యత్తు పోకడలు, అవకాశాలను గుర్తించడం వంటి కీలకమైన అంశాలను ఈ సమావేశంలో ప్రస్తావించనున్నారని సునీత వివరించారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, వాణిజ్యం, సమాచార సాంకేతిక శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహా పలువురు ప్రముఖులు ఈ సదస్సుకు హాజరవుతున్నారని చేనేత, జౌళి శాఖ కమీషనర్ ఎంఎం నాయక్ తెలిపారు. జౌళి రంగంలో నూతన ఆవిష్కరణలు, సుస్థిరతను పెంపొందించడంలో ప్రభుత్వ నిబద్ధతను నొక్కిచెప్పే ఈ కార్యక్రమం రూపకల్పన చేసామన్నారు. వివిధ సంస్థల సిఇఓలు, వస్త్ర తయారీదారులు, ఇంజనీర్లు, డిజైనర్లు, విధాన రూపకర్తలు, ప్రభుత్వ ప్రతినిధుల కోసం రూపొందించబడిన ఈ సదస్సు పరస్పర జ్ఞాన మార్పిడికి ఉపకరిస్తుందని నాయక్ వివరించారు. ఇక్కడి ప్రదర్శనలో అత్యాధునిక సాంకేతిక వస్త్ర పురోగతిని అన్వేషించవచ్చుని, పరిశ్రమను మరింత స్థిరమైన భవిష్యత్తు వైపు నడిపించే ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని సునీత పేర్కొన్నారు. వినూత్న ప్రదర్శనలో అరటి ఫైబర్, జూట్, ఉన్ని, ఇతర వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేయబడిన ఉపయోగకర ఉత్పత్తులను కూడా ప్రదర్శిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రధానంగా వ్యవసాయ ఆధారితమైనది కాబట్టి, వ్యవసాయ వ్యర్థాలను నూలు, ఫాబ్రిక్, కార్డ్‌బోర్డ్ మొదలైన ఉపయోగకరమైన ఉత్పత్తులకు మార్చడంపై ఈ సదస్సు ఉపయుక్తమైన సమాచారానికి వేదికగా నిలవనుంది.

# లోక కళ్యాణార్థం యాగం చేయడం శుభపరిణామం



**విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :**
ఆధ్యాత్మిక ప్రాంతంగా వెలుగొందుతున్న సత్యనారాయణపురంలో లోక కళ్యాణార్థం చేపట్టిన గణపతి హొమం, నవగ్రహ హొమం, లక్ష్మీ నరసింహ హొమం, సుదర్శన హొమం, రాజమాతాంగి హొమం, బగళాముఖి హొమం, ప్రత్యంగిరా హొమాలు ఫలప్రదం కావాలని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆకాంక్షించారు. సత్యనారాయణపురంలోని గాయత్రీ కళ్యాణ మండపం నందు శనివారం జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండితులు ఎమ్మెల్యే దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అన్ని వర్గాల ప్రజల క్షేమాన్ని కాంక్షిస్తూ.. మూడు రోజులుగా ఈ మహా యజ్ఞాన్ని తలపెట్టడం శుభపరిణామమని మల్లాది విష్ణు అన్నారు. కరువు కాటకాలు దరిచేరకుండా వర్షాలు సమృద్ధిగా పండాలని.. యాగ ఫలితాలు ప్రతిఒక్కరికి దక్కాలని ఈ సందర్భంగా ప్రార్థించారు. పాడి పంటలతో రైతులు, సకల వృత్తులూ పరిఢవిల్లాలని.. నిరుపేదలు, సామాన్యులు సమాజంలోని ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో విరాజిల్లాలని కోరుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంకల్ప బలానికి దైవబలం కూడా తోడవ్వాలని కాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం, సుఖ శాంతులు, సిరి సంపదలు చేకూరాలని.. ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు వరించాలని అభిలషించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శర్వాణీ మూర్తి, నాయకులు దోనేపూడి శ్రీనివాస్, యల్లాప్రగధ సుధీర్ బాబు, జె.కె.సుబ్బారావు, చల్లా సుధాకర్, శనగవరపు శ్రీనివాస్, కమ్మిలి రత్నకుమార్, కోలవెన్ను కొండా, ఎం.సత్యశ్రీహరి, కొప్పరపు మారుతి, చామర్తి మూర్తి, పి.సనత్, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# వీసీ పోస్టులు భర్తీకి తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం

**హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త :**
విశ్వ విద్యాలయాల్లోని వైస్ ఛాన్సలర్ల పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. రాష్ట్రంలోని పది యూనివర్సిటీలకు నోటిఫికేషన్ జారీ చేసింది. అర్హత గల వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఉన్నత విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు.

**వీసీ పోస్టులు ఖాళీగా ఉన్న యూనివర్సిటీలివే..**
ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్. డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, హైదరాబాద్. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్. కాకతీయ యూనివర్సిటీ, వరంగల్. మహాత్మా గాంధీ యూనివర్సిటీ, నల్గొండ. శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్. తెలంగాణ యూనివర్సిటీ, నిజామాబాద్. పాలమూరు యూనివర్సిటీ, మహబూబ్‌నగర్. జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ, హైదరాబాద్.


# తమిళనాట మరో రాజకీయ పార్టీ..!



**చెన్నై, నేటి పత్రిక ప్రజావార్త :**
తమిళనాట మరో రాజకీయ పార్టీ.. అదీ ప్రముఖ నటుడి నుంచే రాబోతుందన్న వార్త జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇలయ దళపతిగా తమిళనాట అశేష అభిమానం సంపాదించుకున్న విజయ్ త్వరలో కొత్త పార్టీ ప్రారంభించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా జరిగిన విజయ్ పీపుల్స్ మూవ్‌మెంట్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ఓ నిర్ణయం తీసుకోగా.. సభ్యులు పొలిటికల్ పార్టీ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. తమిళ చిత్రసీమలో నటనతోపాటు సేవా కార్యక్రమాలతో విజయ్ అక్కడి ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. ఈ మధ్యే వరద బాధితులకు స్వయంగా ఆయనే నిత్యావసరాలు అందించారు. అలాగే.. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో 10, 12 తరగతుల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గతేడాది జూన్‌లో నీలాంగరైలో ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఆ సమయంలో ఓపికగా కొన్ని గంటలపాటు స్టేజ్‌పైనే ఆయన నిల్చుని ఉన్నారు కూడా. మరోవైపు విజయ్ పీపుల్స్ మూవ్‌మెంట్ తరపున గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల కోసం రాత్రి పాఠశాలలు ప్రారంభించారు. గ్రంథాలయాలను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గురువారం చెన్నై సమీప పనయూర్‌లోని తన కార్యాలయంలో విజయ్ మక్కల్ ఇయక్కం నిర్వాహకులతో సంప్రదింపులు సమావేశం నిర్వహించారు. చెన్నై, కోవై, తిరుచ్చి, మధురై సహా అన్ని జిల్లాల నుంచి 150 మంది నిర్వాహకులు పాల్గొన్నారు. రాజకీయ పార్టీ ప్రారంభించాలని సమావేశంలో పలువురు డిమాండు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయాలపై విజయ్ చర్చించినట్లు సమాచారం. మరో నెలరోజుల్లో కొత్తపార్టీ విషయమై ప్రకటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. పార్టీ పేరు ఖరారు చేసి నమోదు చేసిన తర్వాత.. లోక్‌సభ ఎన్నికల్లో ఎవరికైనా మద్దతివ్వాలా లేక ఒంటరిగా పోటీ చేయాలా అనే అంశలపై మరోసారి నిర్వాహకులతో సంప్రదింపులు జరపనున్నట్లు చెబుతున్నారు.గతంలో విజయ్ తండ్రి.. ప్రముఖ దర్శకుడు ఎస్.ఏ చంద్రశేఖర్ విజయ్ అభిమాన సంఘాన్ని రాజకీయాల వైపు అడుగులు వేయించే యత్నం చేశారు. అయితే ఆ సమయంలో రాజకీయాలపై ఏమాత్రం ఆసక్తికనబర్చని విజయ్.. తండ్రితో విబేధించారు కూడా. అయితే ఇప్పుడు విజయ్ పీపుల్స్ మూమెంట్ పేరిట సహాయక కార్యక్రమాలు చేస్తున్న ఆయన.. దానిని పార్టీగా మార్చేందుకు అడుగులు వేస్తున్నట్లు సమాచారం. తమిళనాట సినిమా వాళ్ల రాజకీయాలు చాలా టిపికల్‌గా ఉంటాయి. యాక్టర్ పొలిటీషియన్లుగా మారి సక్సెస్ అయిన రేటు ఎక్కువే. ఫెయిల్యూర్స్‌ను వేళ్ల మీద చెప్పొచ్చు. అయితే స్టార్‌డమ్ ఉన్న రజనీకాంత్ ఆ ప్రయత్నంలో వెనుకంజ వేయగా.. కమల్‌హాసన్ మాత్రం ఘోరంగా తడబడ్డారు. ఇక.. వీళ్లిద్దరి తర్వాత ఆ స్థాయి అభిమానం ఉన్న విజయ్ రాజకీయాల్లోకి వస్తే.. ఆదరణ ఎలా ఉండబోతుందా? అనేది చర్చనీయాంశంగా మారిందక్కడ.

## 'పద్మవిభూషణ్' పురస్కారాలకు ఎంపికైన చిరంజీవికి, వెంకయ్య నాయుడుకి అభినందనలు

### - పవన్ కళ్యాణ్



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

భారత చలన చిత్రసీమలో తనదైన ప్రత్యేక స్థానాన్ని స్వయంకృషితో సాధించుకున్న అన్నయ్య చిరంజీవి ని 'పద్మవిభూషణ్' పురస్కారం వరించడం ఎనలేని సంతోషాన్ని కలిగించింది. నటనలోకి ఎంతో తపనతో అడుగుపెట్టిన అన్నయ్య తనకు వచ్చిన ప్రతి పాత్రను, చిత్రాన్నీ మనసుపెట్టి చేశారు. కాబట్టే ప్రేక్షక హృదయాలను గెలుచుకున్నారు. అగ్రశ్రేణి కథానాయకుడిగా సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు. సామాజిక సేవా రంగంలో అన్నయ్య చిరంజీవి చేస్తున్న సేవలు ఎందరికో ఆదర్శంగా నిలిచాయి. పద్మవిభూషణ్ పురస్కారానికి ఎంపికైన శుభ సందర్భంగా చిరంజీవికి హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను.

మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు 'పద్మవిభూషణ్' పురస్కారానికి ఎంపిక కావడం ముదావహం. విద్యార్థి నాయకుడు దశ నుంచి ఉప రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన వెంకయ్య నాయుడు సుదీర్ఘ కాలం ప్రజా జీవితంలో ఉన్నారు. ఆయన వాగ్ధాటి, తెలుగు భాషపై ఉన్న పట్టు అసామాన్యమైనవి. కేంద్ర మంత్రిగా విశేషమైన సేవలందించారు. రాజకీయ ప్రస్థానంతోపాటు స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. వెంకయ్య నాయుడుకి మనస్ఫూర్తిగా అభినందనలు తెలియచేస్తున్నాను.

తెలుగు రాష్ట్రాలు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ నుంచి కళా, సాహిత్య రంగాల నుంచి పలువురు పద్మశ్రీ పురస్కారాలకు ఎంపిక కావడం సంతోషకరం. మచిలీపట్నానికి చెందిన హరికథ కళాకారిణి ఉమా మహేశ్వరి, తెలంగాణ రాష్ట్రం నుంచి చిందు యక్ష గాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, స్థపతి వేలు ఆనందాచారి, బుర్ర వీణ వాయిద్యకారుడు దాసరి కొండప్ప, సాహిత్య విభాగం నుంచి కేతావత్ సోంలాల్, కూరెళ్ళ విఠలాచార్య పద్మశ్రీ పురస్కారాలకు ఎంపిక కావడం ఆనందదాయకం. వారికి నా అభినందనలు అని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఓ ప్రకటన ద్వారా అభినందనలు తెలియచేశారు.

## ఏపీలో పేదలకు జగన్ సర్కార్ మరో శుభవార్త.. ఈ నెల 27 నుంచి ఉచితంగా!



**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

ఏపీలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు వాటికి రిజిస్ట్రేషన్లు కూడా చేయడం ద్వారా కొత్త చరిత్ర సృష్టించబోతోంది. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్టర్ చేసిన తొలి ప్రభుత్వంగా రికార్డులకెక్కనుంది. ఈ రిజిస్ట్రేషన్లతో పేదలకు ఆ స్థలాలపై పూర్తి హక్కులు లభిస్తాయి. ఈ నెల 27 నుంచి పేదలకు ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభంకానున్నాయి.

పేదలకు జగన్ సర్కార్ ఈ నెల 27 నుంచి వచ్చేనెల 9 వరకు పేదలకు అందించిన ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్లు చేయాలని భూ పరిపాలన శాఖ ఆదేశించింది. జిల్లా కేంద్రాల్లో జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమం పూర్తయ్యే వరకు వీఆర్వోలు సంబంధిత సచివాలయాల్లో ప్రత్యక్షంగా విధుల్లో ఉండేలా చూడాలన్నారు. బయోమెట్రిక్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరపాలని.. సర్వే, ప్లాట్ నంబర్లు, పేర్లు, ఇతర వివరాల నమోదులో తప్పులు దొర్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిధులను మంజూరు కాగానే పంపిస్తామని.. ముఖ్యమంత్రి సందేశంతో ముద్రించే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నాణ్యత ఉండేలా చూడాలన్నారు.

రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఆర్డినెన్స్ నేడో, రేపో జారీ కానుంది. ఈలోపు రిజిస్ట్రేషన్లు చేసేందుకు రెవెన్యూ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ప్రభుత్వం రాష్ట్రంలో 31.19 లక్షల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. ఇందుకోసం 17 వేలకుపైగా వైఎస్సార్ జగనన్న కాలనీలు నిర్మించింది. ఇళ్ల పట్టాలు పొందిన పదేళ్ల తర్వాత వాటిపై లబ్ధిదారులు సర్వ హక్కులు పొందేలా ప్రభుత్వం అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించింది. ఇప్పుడు దాని ప్రకారమే 30 లక్షల ఇళ్ల స్థలాలకు సంబంధించిన యజమానులకు కన్వేయన్స్ డీడ్‌లు అందించనుంది.

పట్టాలు పొందిన వారికి ఆ స్థలాలను రిజిస్టర్ చేయనుంది ప్రభుత్వం. ఈ పట్టాలు పదేళ్ల గడువు ముగిసిన తర్వాత ఆటోమేటిక్‌గా సేల్ డీడ్‌లుగా మారతాయి. అప్పుడు ప్రభుత్వం జోక్యం లేకుండానే నేరుగా ఆ స్థలాలను అమ్ముకోవడానికి, ఇతర ప్రయోజనాల కోసం వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. పేదలు ఇబ్బందులు పడకుండా ఆ స్థలాలను వారి పేరుతోనే ఇప్పుడు ప్రభుత్వం రిజిస్టర్ చేసి కన్వేయన్స్ డీడ్‌లు ఇస్తోంది. పదేళ్ల తర్వాత అవి సేల్ డీడ్‌లుగా మారతాయి.

ఈ నెల 27 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రభుత్వం తరఫున వీఆర్వో పేదలకు రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. పంచాయతీ కార్యదర్శులు, వార్డు పరిపాలన కార్యదర్శులు జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా వ్యవహరించనున్నారు. ఇప్పటికే రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వచ్చే నెల 9వ తేదీకల్లా రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు.

ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లు, తహశీల్దార్లు ఆయా మండలాల్లో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇళ్ల పట్టాల డేటా, లబ్ధిదారుల వివరాలు, వారికి కేటాయించిన ప్లాట్లు, వాటి నంబర్లు, హద్దులు పరిశీలించి రిజిస్ట్రేషన్లకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్లు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలను సందర్శించి క్షేత్ర స్థాయిలో అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ పూర్తవగానే అర్హులకు కన్వేయన్స్ డీడ్‌లను పంపిణీ చేయాలని స్పష్టం చేసింది. వీఆర్వోలు సచివాలయాల్లోనే అందుబాటులో ఉండేలా చూసే బాధ్యతను తహశీల్దార్లకు అప్పగించింది.

# ప్రసిద్ధ శ్రీ వజ్రేశ్వరి దేవి ఆలయం

ఆధ్యాత్మిక డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త :

వజ్రేశ్వరి దేవిని స్థానికులు కంగ్రా దేవి అని కూడా పిలుస్తారు. ఈ ఆలయం 11వ శతాబ్దం నాటిది. భక్తులు దూరం నుంచే ఈ ఆలయంలోని బంగారు కలశాన్ని చూడవచ్చు. ఈ ఆలయాన్ని సందర్శించేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ ఆలయానికి సంబంధించి ఇప్పటి వరకు ఎవరూ కనిపెట్టలేని రహస్యం ఉందని.. భక్తులు దీనిని అమ్మవారి అద్భుతంగా భావిస్తారు. కాంగ్రాలోని వజ్రేశ్వరి దేవి ఆలయంలో కాల భైరవుని విగ్రహం కూడా ఉంది. పురాణాల ప్రకారం, చుట్టుపక్కల ప్రాంతంలో ఏదైనా సంక్షోభం సంభవించినప్పుడు ఈ భైరవ విగ్రహం కళ్ల నుండి కన్నీరు కారడం ప్రారంభమవుతుందని నమ్ముతారు.

మన దేశంలో అనేక రహస్య ఆలయాలున్నాయి. కొన్ని మిస్టరీలను నేటికీ ఛేదించలేకపోయారు. అలాంటి మిస్టరీ ఆలయం హిమాచల్‌లోని ప్రసిద్ధ శ్రీ వజ్రేశ్వరి దేవి ఆలయం. ఈ ఆలయం ధర్మశాల నుండి 20 కి.మీ దూరంలో ఉన్న నాగర్‌కోట్ పట్టణంలోని కాంగ్రాలో ఉంది. పార్వతి దేవి ప్రసిద్ధ ఆలయంగా ఖ్యాతిగాంచింది. తొమ్మిది పుణ్యక్షేత్రాలలో ఒకటి. అంతేకాదు శక్తి పీఠాల్లో ఒకటి. వజ్రేశ్వరి దేవిని స్థానికులు కంగ్రా దేవి అని కూడా పిలుస్తారు. ఈ ఆలయం 11వ శతాబ్దం నాటిది. భక్తులు దూరం నుంచే ఈ ఆలయంలోని బంగారు కలశాన్ని చూడవచ్చు. ఈ ఆలయాన్ని సందర్శించేందుకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ ఆలయానికి సంబంధించి ఇప్పటి వరకు ఎవరూ కనిపెట్టలేని రహస్యం ఉందని.. భక్తులు దీనిని అమ్మవారి అద్భుతంగా భావిస్తారు.

విగ్రహం నుండి కన్నీరు

కాంగ్రాలోని వజ్రేశ్వరి దేవి ఆలయంలో కాల భైరవుని విగ్రహం కూడా ఉంది. పురాణాల ప్రకారం, చుట్టుపక్కల ప్రాంతంలో ఏదైనా సంక్షోభం సంభవించినప్పుడు ఈ భైరవ విగ్రహం కళ్ల నుండి కన్నీరు కారడం ప్రారంభమవుతుందని నమ్ముతారు. విగ్రహం నుండి కన్నీళ్లు రావడం చూసిన వెంటనే ఆలయ పూజారి ఎటువంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకు ప్రత్యేక పూజలను చేస్తారు. ఈ కాల భైరవ విగ్రహం సుమారు ఐదు వేల సంవత్సరాల నాటిదని చెబుతారు. భైరవస్వామి కన్నీళ్ల వెనుక దాగి ఉన్న రహస్యం ఏమిటో ఇప్పటి వరకు ఎవరూ తెలుసుకోలేకపోయారు.

శక్తి పీఠాల్లో ఒకటి.. సతీదేవి ఎడమ రొమ్ము ఉన్న క్షేత్రం

పురాణాల ప్రకారం సతీదేవి తండ్రి దక్ష ప్రజాపతి నిర్వహించిన యాగానికి తనను, తన భర్త శివుడిని





ఆహ్వానించకపోవడం అవమానంగా భావించి అదే యాగం జరుగుతున్న అగ్నిలో దూకి తనను తాను దహనం చేసుకుంది. అనంతరం శివయ్య తన భార్య సతీదేవి మృత దేహాన్ని భుజంపై వేసుకుని మోస్తూ విశ్వం చుట్టూ తిరుగుతుండగా.. శ్రీ విష్ణువు తన సుదర్శన చక్రంతో సతీదేవి శరీరాన్ని 51 భాగాలుగా ఖండించాడు. అప్పుడు ఆమె శరీర భాగాలు భూమిమీద రకరకాల ప్రదేశాల్లో పడ్డాయి. సతీదేవి శరీర భాగం ఎక్కడ పడితే అక్కడ శక్తిపీఠం ఏర్పడింది. ఇలా సతి ఎడమ రొమ్ము పడిపోయిన ప్రదేశం వజ్రేశ్వరి ఆలయం. కాంగ్రా మాయి పేరుతో పూజించబడుతుందని నమ్ముతారు.

## పెరుగన్నంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు

**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**



పెరుగన్నం గురించి ప్రత్యేకంగా పరిచయాలు చేయాల్సిన పని లేదు. అందరికీ పెరుగన్నం గురించి తెలుసు. పెరుగు అన్నాన్ని పిల్లలు, పెద్దలు ఇష్టంగా తింటారు. నిజానికి పెరుగన్నం ఎంతో ఆరోగ్యకరమైన భోజనంగా చెబుతున్నారు నిపుణులు. పెరుగన్నంలో ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయట. మీరు రెస్టారెంట్స్‌లలో చూస్తే పెరుగన్నాన్ని మంచిగా తాళింపు పెట్టి.. నీటిగా ఫ్రూట్స్‌తో గార్నిష్ చేసి తీసుకొస్తారు. రెస్టారెంట్లలో కూడా చాలా మంది పెరుగన్నాన్ని తింటారు. పెరుగు అన్నం తింటే శరీరాన్ని చల్లబరుస్తుంది. చర్మానికి, జుట్టు ఆరోగ్యంగా ఉండేందుకు కూడా పెరుగు హెల్ప్ చేస్తుంది. ఇంకా పెరుగన్నంతో ఎలాంటి బెనిఫిట్స్ ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

**బ్యాక్టీరియాతో పోరాడుతుంది..**

పెరుగు అన్నం క్రమం తప్పకుండా తింటే రోగాల బారిన పడే అవకాశం తగ్గుతుంది. పెరుగు అన్నంలో మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఇది శరీరంలోని చెడు బ్యాక్టీరియాతో పోరాడుతుంది. అలాగే జీర్ణ వ్యవస్థకు, ప్రేగుల ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

**గట్ ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది..**

జీర్ణ సంబంధిత సమస్యలతో బాధ పడేవారు పెరుగన్నం తింటే చాలా బెటర్. పెరుగులో ప్రోబయోటిక్ ఉంటుంది. ఇది జీర్ణ క్రియను మెరుగు పరచడమే కాకుండా.. పొట్ట సమస్యలను తగ్గించడానికి సహాయ పడుతుంది. చెడు బ్యాక్టీరియాతో పోరాడుతుంది. గట్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. పెరుగు అన్నం తింటే గ్యాస్, కడుపులో నొప్పి, మంట, మల బద్ధకం వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

**ఎముకలు, దంతాలు హెల్దీగా ఉంటాయి..**

పెరుగులో క్యాల్షియం కంటెంట్ మెండుగా ఉంటుది. ఇది ఎముకలు, దంతాల ఆరోగ్యానికి చాలా అవసరం. పెరుగు అన్నం తింటే ఎముకలు, దంతాలు కూడా గట్టి పడతాయి. పలు సమస్యలు కూడా కంట్రోల్ అవుతాయి.

**బరువు అదుపులో ఉంటుంది:**

బరువు తగ్గాలి అనుకున్న వారు పెరుగు అన్నం తింటే చాలా మంచిది. ఎందుకంటే ఇది కొద్దిగా తిన్నా కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. అలాగే ఆకలి పెద్దగా వేయదు. దీంతో ఇతర చిరు తిళ్లు తినే అవకాశం ఉండదు. పెరుగులో ఉండే ప్రోబయోటిక్స్ జీవక్రియను ప్రభావితం చేస్తాయి. ఇది కూడా మీ బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది. పెరుగులో ఉండే ప్రోటీన్, క్యాల్షియంలు మీ ఆకలిని నియంత్రిస్తాయి. ఇలా బరువు తగ్గొచ్చు.

## ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం





మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త :

వచ్చే 2024 25 సంవత్సరానికి రూ.226.32 కోట్ల రూపాయల మిగులు బడ్జెట్ను ఆమోదిస్తూ తీర్మానం చేశామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పేర్కొన్నారు. శనివారం నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జడ్పీ చైర్ పర్సన్ వుప్పాల హారిక ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజబాబు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో కలిసి నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో జిల్లాను ప్రగతి పథంలో అగ్ర భాగాన నిలిపేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 2023-24 సంవత్సరంలో విడుదలైన అంచనాల మొత్తం 40 కోట్ల రూపాయలకు గాను రు.37.80,44,589లు వ్యయం చేశామన్నారు. 2024-25 సంవత్సరంలో విడుదలైన అంచనాల మొత్తము 45 కోట్ల రూపాయల గాను వ్యయం అంచనా 45 కోట్ల రూపాయలను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.

జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా జరుగుతుందన్నారు. రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత రైతు భరోసా కేంద్రాల ద్వారా సమీపంలో ఉన్న మిల్లులకు కేటాయించడం జరుగుతుందన్నారు. జిల్లాలో గోనె సంచులకు ఏలాంటి కొరత లేదని 40వేల సంచులను ఆర్.బి.కెలలో సిద్ధంగా అందుబాటులో ఉంచామన్నారు. ఆర్ బికేలలో ఉన్న ప్రమాణాల అనుసరించి ధాన్యం ధరలు నిర్ణయించడం జరుగుతుందని, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే బయట ఎక్కువ ధర లభిస్తుంటే బయటనే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చున్నారు. అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ అవనిగడ్డ జాతీయ రహదారి పక్కన మురికి నీటి కాలువ పూడి పోయిందని దాని బాగు చేయించాలన్నారు. మోపిదేవి పాత కరకట్ట పక్కన నివసిస్తున్న వారికి పొసెషన్ ధ్రువీకరణ పత్రాలు లేదా పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్‌పర్సన్ సూచించారు. ఈ సమావేశంలో కృష్ణాజిల్లా సంయుక్త కలెక్టర్ గీతాంజలిశర్మ, కృష్ణ ఎన్టీఆర్ ఏలూరు జిల్లాలకు చెందిన వివిధ శాఖల జిల్లా అధికారులు, జడ్పీటిసిలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

# మారుమూల గిరిజన ప్రాంతాలకు సమర్ధవంతమైన టెలికాం సేవలు

### - 400 సెల్ టవర్ల ప్రారంభ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్




**అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త :**

మారుమూల గిరిజన ప్రాంతాలకు సమర్థవంతమైన టెలికాం సేవలందించడంతో పాటు సంక్షేమాభివృద్ధి పథకాలు ప్రతి ఇంటికి పారదర్శకంగా అందాలన్న తపన, తాపత్రయంతో అడుగులు వేగంగా వేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా దాదాపు రూ.400 కోట్లతో 400 సెల్ టవర్లను నిర్మించామని తెలిపారు. గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి వాటిని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 400 సెల్ టవర్ల ద్వారా 2.42 లక్షల మందికి ప్రయోజనం చేకూరిందన్నారు. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ప్రకాశం, ఏలూరు, శ్రీకాకుళం, కాకినాడ జిల్లాల్లోని మారు మూల ప్రాంతాల వారు ఫోన్లలో మాట్లాడే వీలు కలుగుతోందన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన టవర్ల ద్వారా 944 గ్రామాలకు కనెక్టివిటీ ఏర్పడుతుందని చెప్పారు. మొత్తంగా రూ.3,119 కోట్లతో 2,900 టవర్లను ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించామని తెలిపారు. తద్వారా 5,549 ఆవాసాలను కనెక్టివిటీలోకి తీసుకొచ్చేందుకు మార్గం ఏర్పడుతుందని తెలిపారు. దీన్ని సఫలీకృతం చేసేందుకు కేంద్రంతో మాట్లాడి.. ఇందులో భాగస్వామ్యం అయ్యేలా ఒప్పించామన్నారు. సెల్ టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూములను 2,900 లొకేషన్లలో ఇప్పటికే ఇచ్చామని స్పష్టం చేశారు. 'ఎటువంటి ఇబ్బంది లేకుండా సెల్ టవర్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చాం. పవర్ కనెక్షన్‌కు చర్యలు తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి చేయాల్సినవన్నీ రెట్టించిన వేగంతో చేశాం. టవర్ల నిర్మాణ కార్యక్రమం ఇప్పటికే మొదలైంది. దేవుడు ఆశీర్వదిస్తే ఇదే మాదిరిగా ప్రతి 3 నెలలకొకసారి...400 నుంచి 500 టవర్ల నిర్మాణం పూర్తి చేసి అన్నింటినీ అందుబాటులోకి తీసుకొస్తాం. మరో ఏడాది కాలంలో అన్ని టవర్ల నిర్మాణం పూర్తి చేస్తాం' అని తెలిపారు.

మారుమూల ఆవాసాల్లో టీవీలు, ఫోన్లు

సెల్ టవర్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో.. కనెక్టివిటీ లేని ఆవాసాలను సమాజంతో కనెక్ట్ చేసే కార్యక్రమం జరుగుతోందని.. టీవీలు, ఫోన్లు పనిచేస్తాయని సీఎం వైఎస్ జగన్ అన్నారు. మనం ఇచ్చే పథకాలకు సంబంధించి వివరాలన్నింటినీ వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందని చెప్పారు. మనం బటన్ నొక్కిన వెంటనే వాళ్లకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ కావడం కూడా అంతే వేగంగా జరుగుతుందన్నారు. వెంటనే వాళ్లు చూసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇవన్నీ వేగవంతంగా, ఎఫెక్టివ్‌గా, పారదర్శకంగా జరగడం కోసమే ఈ కనెక్టివిటీ చాలా అవసరంగా భావించి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకే వ్యవస్థ, విలేజ్ క్లినిక్‌లు, నాడు-నేడుతో బాగు పడుతున్న ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు.. ఇవన్నీ గ్రామ రూపురేఖలను మార్చే దిశగా పడుతున్న అడుగులని, ఈ నేపథ్యంలో కనెక్టివిటీ అన్నది అత్యంత ఉపయోగకరమైన అంశం అవుతుందన్నారు.

ఈ కార్యక్రమం నిర్వహించిన సీఎం క్యాంపు కార్యాలయంలో ఐటీ, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్‌రెడ్డి, ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్, కమ్యూనికేషన్స్ (ఐటీ శాఖ) డైరెక్టర్ సి.చంద్రశేఖర్ రెడ్డి, భారతీ ఎయిర్‌టెల్, రిలయెన్స్ సంస్థల ప్రతినిధులు.. డుంబ్రిగుడ మండలం ఈదులపాలెంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పాడేరు నియోజకవర్గ సమన్వయకర్త మత్స్యరాస విశ్వేశ్వరరాజు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌సిన్హా, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt Ltd, D.NO: 33-5-9 Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District , Andhra Pradesh and Published From H.No: 24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line cross, VIJAYAWADA Krishna District Andhra Pradesh. Editor Konduri Srinivasarao, RNI Title APTEL/2021/80559, Phone :9948877444, Email Id: konduri9999@gmail.com